సాక్షి పెద్దపల్లి

మంగళవారం : 21 : మార్చి : 2023



పంటలు మునుగుతున్నా పట్టదా

మంథని: 'ప్రాజెక్టు కట్టినప్పుడు మా పొలాలకు ఏం కాదు అన్నరు.. మా భూములు తీసుకొని మరో చోట ఇస్తమన్నరు.. లేకుంటే ఎకరానికి రూ.20 లక్షలు చెల్లిస్తమంటిరి..

8లో ▸



స్థలాలు కబ్జా..?!

పట్టించుకునే వారు లేక ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురువుతున్నాయి. అర్హులైన పేదలకు చెందాలి ్సన నివాస స్థలాలు ధనవంతులు, ఆక్రమ ణదారుల చేతుల్లో చేరిపోతున్నాయి.

8లో ▸

గరిష్టం/కనిష్టం

30.0/21.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తక్కువగా నమోదు అవుతుంది. కొన్నిచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'నిజమైన స్నేహితులు'కు బాలమణి పురస్కారం


శ్రీలత

ధర్మారం: మండలంలోని నర్సింహులపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న వేల్పుల శ్రీలత రాసిన నిజమైన స్నేహితులు పుస్తకానికి డాక్టర్ చింతోజు బ్రహ్మయ్య బాలమణి పురస్కారం లభించినట్లు తెలుగు ఉపాధ్యాయుడు భాస్కర్ తెలిపారు. రాజన్నసిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌కు చెందిన డాక్టర్ శంకర్, రాజారాం ఏటా బాల సాహిత్యంలో వచ్చిన విశిష్ట రచనలకు అవార్డులు అందిస్తున్నారు. ఇందులో శ్రీలత రాసిన పుస్తకానికి పురస్కారం లభించింది. ఈ సందర్భంగా ట్రస్టు కన్వీనర్ గరిపెల్లి అశోక్ రూ.1116తోపాటు బాల రచయిత్రిని సన్మానించడంతోపాటు జ్ఞాపిక అందించారు. శ్రీలతను సర్పంచు అడువాల అరుణ జ్యోతి, ఎంపీటీసీ దాడి సదయ్య, ఎస్‌ఎంసీ చైర్మన్ రాయమల్లు, ప్రధానోపాధ్యాయుడు వీవీ.సత్యనారాయణ అభినందించారు.

మత్తడి దూకుతున్న గోపరపల్లె చెరువు


గోపరపల్లె చెరువు

ఓదెల: మండలంలోని గోపరపల్లె చెరువులోకి ఎస్సారెస్పీ కాలువ నీటితోపాటు ఇటీవలి వర్షానికి ప్రవాహం పెరగడంతో మత్తడి దూకుతోంది. ఎప్పుడు లేనివిధంగా ఈ ఎండాకాలంలో చెరువు నిండడంతో రైతుల్లో ఉత్సాహం నెలకొంది. చెరువులోకి నీరు సమృద్ధిగా రావటంతో పంటలు పండించుకునే అవకాశముందని అంటున్నారు.

25న పెద్దపల్లికి బస్సుయాత్ర


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మతసామరస్యం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం కోసం సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన బస్సుయాత్ర ఈనెల 25న జిల్లాకేంద్రానికి చేరుతుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు తెలిపారు. పెద్దపల్లి జెండాకూడలిలో సోమవారం పార్టీ నాయకులతో కలిసి ప్రజా చైతన్య యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. మోదీ, అమిత్‌షా నేతృత్వంలో కార్పొరేట్ కంపెనీలకు ప్రభుత్వ రంగ సంస్థలను అప్పగిస్తూ ప్రజలపై పన్నుల భారం మోపుతోందని ఆరోపించారు. ప్రజాధనాన్ని లూటీ చేసేందుకే పాలకులు ప్రయత్నిస్తున్నారని వివరించారు. రాష్ట్రవిభజన సమయంలో ఇచ్చిన హామీలు అమలుకు నోచడం లేదన్నారు. నాయకులు జ్యోతి, అశోక్, ప్రశాంత్, నవీన్, వెంకటస్వామి, ఖాజా, రాజు, రవి, అరుణ్, రామచంద్రం, శంకర్ తదితరులున్నారు.

బీ-థర్మల్ పరిరక్షణకు నిరసన దీక్ష


దీక్షకు సంఘీభావం తెలిపిన బీ థర్మల్ ఉద్యోగులు

రామగుండం: బీ-థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని రక్షించాలని, నూతన కేంద్రాలను ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకుడు కౌశిక హరి సోమవారం చేపట్టిన నిరసన దీక్షకు ప్రజలు తరలివచ్చారు. హరి మాట్లాడుతూ.. 62.5 మెగావాట్ల సామర్థ్యం గల బీ-థర్మల్ విద్యుత్ కేంద్రం పునరుద్ధరణకు నిధులు కేటాయించాలని కోరారు. బీ-థర్మల్ కొనసాగింపుపైనే రామగుండం అస్తిత్వం ఆధారపడి ఉందన్నారు. దీక్షకు ఆర్యవైశ్య సంఘం, ట్రాక్టర్ ఓనర్ల సంఘం, స్వర్ణకారుల సంఘం, ఓసీపీ కాంట్రాక్టు కార్మికుల సంఘంతోపాటు మరిన్ని యూనియన్లు సంఘీభావం ప్రకటించారు. కార్పొరేటర్ కౌశిక లత, మాజీ ఎమ్మెల్యే కాసిపేట లింగయ్య, బీజేపీ నాయకులు పి.మల్లికార్జున్, మారం వెంకటేశ్, మహావాది రామన్న, సుల్వ లక్ష్మినర్సయ్య, గంగాప్రసాద్, జెన్‌కో జేఏసీ ప్రతినిధులు ఎండీ.సలీం, బొడ్డు యాదగిరి, కొమ్మురాజుల మల్లేశ్, లగిశెట్టి రవికుమార్, నూనె రాజు, జాగటి శ్రీకాంత్ తదితరులున్నారు.

జ్వరం, దగ్గు, జలుబు..

ఇంటింటికీ బాధితులే.. ప్రధానంగా చిన్న పిల్లలే

- ఫ్లూ పంజాకు తోడు వర్షం తెచ్చిన తంటా
- ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో పెరుగుతున్న ఓపీ

రామగుండం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఓపీ ఇలా..

తేదీ	ఓపీ	సీజనల్ ఓపీ
20	531	245
18	397	150
17	381	162
16	441	191
15	460	221
14	538	286
13	563	238


పెద్దపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రిలో జ్వరపీడితులు


జ్వర బాధితులతో కిటకిటలాడుతున్న గోదావరిఖని ఏరియా ఆసుపత్రి

సాక్షి, పెద్దపల్లి: జిల్లాలో ఫ్లూవైరస్ కంగారుపెడుతోంది. మారుతున్న వాతావరణ పరిస్థితులు, చిన్నపాటి నిర్లక్ష్యం కారణంగా జ్వర బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ప్రభుత్వ, ప్రైవేటు.. ఆసుపత్రి ఏదైనా రోగులతో కిటకిటలాడుతున్నాయి. ముఖ్యంగా జిల్లా కేంద్ర ఆసుపత్రి, గోదావరిఖని ఏరియా ఆసుపత్రుల్లో ఓపీ విభాగానికి బాధితుల తాకిడి పెరిగింది. రోజురోజూకు బాధితులు పెరుగుతున్నారు తప్ప తగ్గడం లేదు. వీరిలో కొందరు ఆసుపత్రిలో అడ్మిట్ అవుతుండగా.. మరికొందరు చికిత్స తీసుకుని ఇళ్లకు వెళ్లిపోతున్నారు. కరోనాకు సంబంధించిన ఉపరకం హెచ్3ఎన్2 ఇన్‌ఫ్లుయెంజా లక్షణాలతో జిల్లావాసులు ఇబ్బంది పడుతుండగా.. తాజాగా కురిసిన వర్షాలతో మరింత మంది వ్యాధుల బారినపడి ఇబ్బంది పడుతున్నారు.

వర్షంతో పెరిగిన కేసులు

జిల్లాలో ఫ్లూ పంజాకు తోడు నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జ్వరాలు విభృంభిస్తున్నాయి. వాతావరణం ఒక్కసారిగా చల్లబడటం, దోమలు పెరగడంతో వివిధ రకాల జ్వరాల బారిన పడుతున్నారు. గ్రామాల కంటే పట్టణాల్లో జ్వరాల కేసులు ఎక్కువగా ఉన్నాయి. మురికివాడల్లోని మురుగు నిలిచే ప్రదేశాల్లో తాగునీటి పైపులైన్ల లీకేజీలతో కూడా విషజ్వరాలు వస్తున్నాయి. జ్వరం, దగ్గు, జలుబు, తలనొప్పి, గొంతు నొప్పి, విరోచనాలు, కడుపునొప్పి తదితరాలతో బాధపడుతున్న వారు కూడా ఎక్కువగా ఉన్నారు.

పిల్లల్లోనూ అధికమే..

చిన్నాపెద్ద తేడా లేకుండా అందరూ వైరల్ జ్వరాల బారిన పడుతున్నారు. ఇంట్లో ఒకరికి జ్వరం వచ్చిందంటే మెల్లమెల్లగా ఇంట్లోని ఇతర కుటుంబసభ్యులకూ వ్యాపిస్తోంది. పెద్దల విషయం పక్కన పెడితే.. చిన్నపిల్లల్లో జ్వర బాధితులు పెరుగుతున్నారు. నిత్యం 10నుంచి 15మంది ఇన్ పేషెంట్లుగా చేరి చికిత్స పొందుతున్నారని అక్కడి సిబ్బంది పేర్కొంటున్నారు. రక్త పరీక్షలు నిర్వహించిన అనంతరం వారిని ఇన్‌పేషెంట్‌గా చేర్చుకుంటున్నారు. సెలైన్లు ఎక్కించడం, ఇతర పరీక్షలు చేస్తూ వ్యాధి నుంచి ఉపశమనం పొందేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆడుతూపాడుతూ గడపాల్సిన పిల్లలు బెడ్‌పై.. సెలైన్లతో ఉండడాన్ని చూసి కుటుంబసభ్యులు ఆవేదన చెందుతున్నారు.

జ్వరం తో వచ్చా...



రెండు రోజులుగా జ్వరం వస్తోంది. దానికి తోడు జలుబు, దగ్గు. పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చేరిన. డాక్టర్లు పరీక్షించి ఇంజిక్షన్ వేసి మందులు ఇచ్చారు. ఇప్పుడు కొంత నయంగా ఉంది.

– జాడి జయలక్ష్మి, కొత్తపల్లి, పాలకుర్తి

జ్వరంతో బాధపడుతున్న



మా వీధిలో దోమల బెడద ఎక్కువ. నాలుగైదు రోజులుగా జ్వరం వస్తోంది. తగ్గకపోవడంతో ఆసుపత్రికి వచ్చా. వైద్య పరీక్షల చేసి మూడ్రోజులు ఇక్కడే ఉండి చికిత్స పొందాలని వైద్యులు చెప్పారు. – సాయి సిద్దార్థ్, ప్రగతినగర్, పెద్దపల్లి

మూడు రోజులుగా జ్వరం



మాది రామగుండం. మా బాబు రెహాన్‌పాషా మూడు రోజులుగా జ్వరంతో తల్లడిల్లుతున్నడు. ఆస్పత్రిలో చూపించినా తగ్గ లేదు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకొచ్చాం. చాలామందికి జ్వరం, దగ్గు, వాంతులు. పేషెంట్లతో ఆస్పత్రి కిటకిటలాడుతోంది.

– ఖాజాపాషా, రామగుండం

జాగ్రత్తలు పాటించండి



జ్వరం, దగ్గు, గొంతునొప్పి, ఒళ్లునొప్పులతో బాధితులు వస్తున్నారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు ఎక్కువ జాగ్రత్త తీసుకోవాలి. భయాందోళనలు వద్దు. చల్లని పానీయాలు, బయటి ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి. చేతులను ఎప్పటికప్పుడు శుభ్రంగా కడుక్కోవాలి. – డాక్టర్ రాజేంద్రప్రసాద్, జనరల్ ఫిజీషియన్, జీజీహెచ్

నిర్లక్ష్యం వద్దు

వైరల్ వ్యాధులు వ్యాప్తిచెందుతున్న తరుణంలో అనారోగ్య లక్షణాలు ఏమున్నా సకాలంలో స్పందించాలి. నిర్లక్ష్యం చేయకుండా చికిత్స తీసుకోవాలి. లేకపోతే తీవ్రత పెరుగుతుంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని రకాల వైద్యసదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. సద్వినియోగం చేసుకోవాలి. – శ్రీధర్, డీసీహెచ్‌వో

ప్రజావాణి సమస్యలకు సత్వర పరిష్కారం



పెద్దపల్లిరూరల్: ప్రజావాణిలో అందిన ఫిర్యాదులపై స్పందించి పరిష్కారమార్గాలు చూపాలని కలెక్టర్ సంగీత అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో స్థానికసంస్థల అడిషనల్ కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి ఫిర్యాదులు స్వీకరించారు. తనకు ఎలాంటి భూమి, ఇల్లు లేకున్నా కాలశ్రీరాంపూర్ ఆర్ఐ తప్పుడు నివేదిక ఇచ్చి డబుల్‌బెడ్‌రూం ఇల్లు రాకుండా చేశాడని మీర్జంపేట గ్రామానికి చెందిన దివ్యాంగురాలు సరిత విన్నవించింది. సదరు ఆర్ఐపై విచారణ జరపాలని కోరింది. తనతండ్రి మరణించిన వివరాలు రిజిస్టర్‌లో లేవంటూ డెత్ సర్టిఫికెట్ ఇవ్వడం లేదని చందపల్లికి చెందిన గుండేటి శ్రీనివాస్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. సింగరేణి ఓపెన్‌కాస్ట్ మైనింగ్ విస్తరణలో ఇల్లు, భూములు కోల్పోయిన తమకు ఆర్ఆర్ ప్యాకేజీతోపాటు ప్లాట్లు ఇచ్చారని, అందులో అభివృద్ధి చేయడం లేదని లద్నాపూర్ భూనిర్వాసితులు కోరారు.

ఐటీ పార్క్‌కు అనుమతించండి


పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: స్థానిక సింగరేణి బీ గెస్ట్ హౌస్‌లో తాత్కాలికంగా ఐటీ పార్క్‌కు అనుమతి ఇవ్వాలని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ సంస్థ సీఎండీని కోరారు. సోమవారం సింగరేణి భవన్‌లో ఆయనను కలుసుకున్నారు. ఎన్ఎండీసీ చైర్మన్‌గా నియామకమైన ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శ్రీధర్‌ను టీబీజీకేఎస్ అధ్యక్షుడు బి.వెంకట్రావ్, ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇండస్ట్రీయల్ ఐటీ పార్కు త్వరగా ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఐటీ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్‌రంజన్‌ను ఎమ్మెల్యే కలిశారు. అంతర్గాంలో ఇండస్ట్రీయల్ పార్కు, రామగుండంలో ఐటీపార్క్ పనులను చేపట్టాలన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ కుట్రలు తిప్పికొట్టాలి


కాల్వశ్రీరాంపూర్‌లో మాట్లాడుతున్న ఎర్రోళ్ల శ్రీనివాస్

- స్టేట్ మెడికల్ కార్పొరేషన్ చైర్మన్, జిల్లా ఇన్‌చార్జి ఎర్రోళ్ల శ్రీనివాస్
- జిల్లాలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాలు

కాల్వశ్రీరాంపూర్/ఓదెల: బీఆర్ఎస్‌కు దేశవ్యాప్తంగా ఆదరణ లభిస్తోందని, దానిని ఓర్వలేక బీజేపీ, కాంగ్రెస్ కుట్రకు పాల్పడుతున్నాయని స్టేట్ మెడికల్ కార్పొరేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జి ఎర్రోళ్ల శ్రీనివాస్ పార్టీ కార్యకర్తలకు సూచించారు. సోమవారం కాల్వశ్రీరాంపూర్, ఓదెల మండల కేంద్రాల్లో నిర్వహించిన పార్టీ ఆత్మీయ సమ్మేళనాల్లో పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. వలస పాలనలో కరువుకోరల్లో ఉన్న రాష్ట్రం నేడు పాడిపంటలతో పచ్చగా, అభివృద్ధి పథంలో ఉందన్నారు. బీఆర్ఎస్ పార్టీని బద్నాం చేసేవారికి గుణపాఠం చెప్పాలన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిపై ప్రతిఒక్కరూ గ్రామాల్లో చర్చ పెట్టాలని సూచించారు. త్వరలో రేషన్‌కార్డులు, కొత్త పింఛన్లు మంజూరు అవుతాయన్నారు. నియోజకవర్గానికి మూడు వేల ఇళ్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. సాగునీటి కోసం కాళేశ్వరం ప్రాజెక్టు, వాగులపై చెక్‌డ్యాంలు నిర్మించినట్లు గుర్తుచేశారు. కాల్వశ్రీరాంపూర్‌లో టీఎస్‌టీఎస్ స్టేట్ మాజీ చైర్మన్ చిరుమల్ల రాకేశ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు రాంచంద్రారెడ్డి, ఏఎంసీ చైర్మన్ సుజాత, పురుషోత్తం, పార్టీ మండల అధ్యక్షుడు రాజకొమురయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రైతులు అధైర్యపడొద్దు

అకాల వర్షానికి పంటలు నష్టపోయిన రైతులు అధైర్యపడొద్దని, ప్రభుత్వం ఆదుకుంటుందని ఎర్రోళ్ల శ్రీనివాస్ తెలిపారు. దెబ్బతిన్న పంటలను సీఎం కేసీఆర్‌కు పంపించి పరిహారం అందించేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఓదెల మండలం గోపరపల్లెలో వడగండ్లతో పడిపోయిన మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఓదెల ఎంపీపీ కునారపు రేణుకాదేవి, కావటి రాజు, సర్పంచ్ కర్క మల్లారెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ గోపు నారాయణరెడ్డి, ఏవో నాగార్జున ఉన్నారు.

ఎకరాకు రూ.30వేలు పరిహారం ఇవ్వండి

- వడగండ్ల వానతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి
- టీ పీసీసీ ఉపాధ్యక్షుడు విజయరమణారావు
- సుల్తానాబాద్, ఎలిగేడు మండలాల్లో పంటల పరిశీలన
- పెద్దపల్లి మండలంలో కొనసాగిన హాథ్ సే హాథ్ కార్యక్రమం


ఎలిగేడు మండలం లాలపల్లిలో పంటలను పరిశీలిస్తున్న విజయరమణారావు

సుల్తానాబాద్/ఎలిగేడు/పెద్దపల్లిరూరల్: వడగండ్ల వర్షానికి పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30వేలు అందించాలని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయరమణారావు ప్రభుత్వానికి సూచించారు. మార్కండేయ కాలనీ, శాస్త్రినగర్, పూసాల, సుల్తానాబాద్‌లో అకాలవర్షానికి దెబ్బతిన్న రేకుల షెడ్లను పరిశీలించారు. వర్షానికి ఇండ్లు, పంటలు ధ్వంసమయ్యాయని, రేకులు లేచిపోయి పేదలు ఇబ్బంది పడ్డారని, వారిని ఆదుకునే బాధ్యత ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డిపై ఉందని అన్నారు. తహసీల్దార్, జాయింట్ కలెక్టర్‌తో ఫోన్లో మాట్లాడారు. కార్యక్రమంలో అంతటి అన్నయ్యగౌడ్, మినుపాల ప్రకాశ్ రావు, దన్నాయక్ దామోదర్ రావు, సాయిరి మహేందర్, చింతల సునీత, రాజు, ఎండీ.రఫిక్, దున్నపోతుల రాజయ్య, కుమార్ కిశోర్, ఎండీ.మోబిన్, అసిఫ్, రవీందర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎలిగేడు మండలంలోని లాలపల్లి, సుల్తాన్‌పూర్ గ్రామాల్లో పర్యటించారు. రాళ్లవర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. వరి, మొక్కజొన్న, మిర్చి, మామిడి, కూరగాయల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, ఎమ్మెల్యే స్పందించి ఎకరాకు రూ.30వేలు, ఇళ్లు దెబ్బతిన్న కుటుంబాలకు రూ.20వేలు ఇప్పించాలని కోరారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, సర్పంచ్‌లు అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, సింగిరెడ్డి ఎల్లవ్వ పాల్గొన్నారు.

తెలంగాణల బతుకులు ఆగమైనయ్

పోరాడి సాధించుకున్న రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా చేస్తానన్న కేసీఆర్ మాటలు నమ్మి అందరి బతుకులు ఆగమయ్యాయని విజయరమణారావు అన్నారు. పెద్దపల్లి మండలం నిమ్మనపల్లి, హన్మంతునిపేటలో హాథ్‌సేహాథ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఎం పాలన నిజాం రాజులను తలపిస్తోందన్నారు. రుణమాఫీ కాలే.. రైతుబంధు అందరికీ అందలే.. డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వలేదని విమర్శించారు. జిల్లాలోని సహజసంపదను ఇష్టానుసారంగా కొల్లగొడుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని పేర్కొన్నారు. నాయకులు శ్రీనివాస్, రాజయ్య, శ్రీనివాస్, ప్రదీప్, సంపత్‌రావు, తిరుపతిరావు, అంజిగౌడ్, సతీష్, కనకయ్య, మహేందర్, సుధాకర్‌రెడ్డి, సంపత్, సుభాష్‌రావు, శ్రావణ్ తదితరులున్నారు.

రైస్ మిల్లర్ల నష్టం రూ.20 లక్షలు



వడగండ్ల వర్షంతో ధ్వంసమైన రైస్‌మిల్ పైకప్పు, వర్షానికి తడిసిపోయిన బియ్యం

సుల్తానాబాద్: వడగండ్ల వర్షానికి పట్టణంలో రైస్‌మిల్లుల్లోని ధాన్యం తడిసిపోయింది. సుమారు ఎనిమిది రైస్‌మిల్లుల్లో నిల్వ చేసిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. పూసాల, సుగ్లాంపల్లిలోని శ్రీనివాస, మహేష్, గౌరీ శంకర్, బాలాజీ, రాఘవేంద్ర రైస్ మిల్లుల పైకప్పులు ధ్వంసమై వడగండ్ల వానకు దెబ్బతిన్నట్లు మిల్లర్లు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. మిల్లులతోపాటు గోదాముల ఉన్న పైకప్పునకు రంధ్రాలు పడి బియ్యం కూడా తడిచిపోయాయని, మొత్తంగా రూ.కోటి వరకు నష్టం వాటిల్లిందని చెబుతున్నారు. అధికారులు సర్వే చేసి న్యాయం చేయాలని కోరుతున్నారు. దెబ్బతిన్న రైస్ మిల్లులను రైస్‌మిల్ సంఘం జిల్లా అధ్యక్షుడు నగునూరి అశోక్ కుమార్, ఎడవెల్లి రాంరెడ్డి, మండల అధ్యక్షుడు చీటి కేశవరావు సోమవారం సందర్శించారు.

నేలవాలిన మొక్కజొన్న

సుల్తానాబాద్‌రూరల్: అకాలవర్షానికి మండలంలోని కాట్నపల్లి, కొమండ్లపల్లి పరిధిలోని భవాని రైస్‌మిల్లులో దాదాపు రూ.30లక్షలు, బాలాజీలో రూ.20లక్షలు, జయకృష్ణలో రూ.20లక్షలు, వీరాంజనేయలో రూ.22లక్షలు, సాయిరామలో రూ.30లక్షలు, శివశంకర్‌లో రూ.20లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు ఆయా మిల్లుల యజమానులు చెబుతున్నారు. రేగడిమద్దికుంట, కనుకుల, గర్రెపల్లి, మంచిరామి, నీరుకుల్ల, గొల్లపల్లిలో వరి, మొక్కజొన్న పంటలు నేలవాలాయి. రైస్‌మిల్లుల్లో జరిగిన నష్టంపై రెవెన్యూ అధికారులు అంచనా వేస్తున్నారు.

సీపీఎం జన చైతన్య యాత్ర పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

జ్యోతినగర్: బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా, ప్రజా సంక్షేమం, మత సామరస్యం, ప్రజా స్వామ్యం, సామాజిక న్యాయం కోసం సీపీఎం పార్టీ చేపట్టిన జన చైతన్య యాత్ర పోస్టర్‌ను ఎన్టీపీసీ రామగుండం ఏరియా కన్వీనర్ ఎం.రామాచారి సోమవారం ఎన్టీపీసీ రామగుండంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఈనెల 17 నుండి 29వ తేదీ వరకు జన చైతన్య యాత్ర జరుగుతుందన్నారు. రామగుండం ప్రాంతానికి ఈనెల 25వ తేదీన గోదావరి బ్రిడ్జి నుంచి పెద్దపల్లి జిల్లాకు ప్రవేశిస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ ఏరియా కార్యదర్శి ఎం రామాచారి, జిల్లా కమిటీ సభ్యులు నాంసాని శంకర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మారం: మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం సీపీఎం పార్టీ జన చైతన్య యాత్ర పోస్టర్‌ను సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రవీందర్ ఆధ్వర్యంలో పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల రాజయ్య, రాగుల శ్రీనివాస్, మల్లేశం, బోరకుంట మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాలిటెక్నిక్ సూపరింటెండెంట్ బదిలీ


వంశీకృష్ణ

రామగిరి(మంథని): మండలంలోని సెంటినరీకాలనీలో గల కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర విశ్వ విద్యాలయం ఉద్యాన (హార్టికల్చర్) పాలిటెక్నిక్ కళాశాల సూపరింటెండెంట్ కె. వంశీకృష్ణ గౌడ్ బదిలీ అయ్యారు. సిద్దిపేట జిల్లా ములుగు ప్రధాన కార్యాలయానికి బదిలీ చేస్తూ యూనివర్సిటీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో యూనివర్సిటీలో విధులు నిర్వహిస్తున్న నబీదుల్లా హఫీజ్‌ను ఇక్కడికి అడ్మినిస్ట్రేషన్ అధికారి(ఏవో)గా బదిలీ చేశారు.

కేవీకేలోని సపోట తోటకు బహిరంగ వేలం

రామగిరి(మంథని): మండలంలోని రత్నాపూర్ శివారు రామగిరి ఖిలా కృషి విజ్ఞాన కేంద్రంలో గల సపోట తోటకు సీల్డ్ టెండర్ లేదా బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ అమనగంటి శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. కేవీకే ఆవరణలోని 590 సపోట చెట్లకు ఈనెల 24న మధ్యాహ్నం 2 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. రూ.3వేలు దరావత్తు రుసుము చెల్లించిన వారు సీల్డ్ టెండర్ లేదా వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు. సీల్డ్ టెండర్‌లను ఈనెల 24న మధ్యాహ్నం 12గంటలకు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. వేలంలో నెగ్గిన వారి దరావత్తు సొమ్మును వేలం తర్వాత చెల్లిస్తామని, ఆసక్తిగల వారు వేలంలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94947 28324, 99490 74 932, 80018 04016 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ఆస్పత్రి సందర్శన వాయిదా

సుల్తానాబాద్: సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించాల్సిన కాయకల్ప బృందం పర్యటన సోమవారం వాయిదా పడింది. వర్షాల కారణంగా రాలేకపోయారని, ఈనెల 27 వారి పర్యటన ఉంటుందని ఎస్‌హెచ్‌ఎం క్వాలిటీ సెల్ అధికారి అనిల్, టీం సభ్యులు డాక్టర్ శ్వేత తెలిపారు.

ఇందిరమ్మకాలనీలో స్థలాలు కబ్జా..?!

- ఇష్టారాజ్యంగా స్థలాల చదును, నిర్మాణాలు
- దళారులు ఆడిందే ఆట.. పాడిందే పాట

జ్యోతినగర్(రామగుండం): పట్టించుకునే వారు లేక ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురువుతున్నాయి. అర్హులైన పేదలకు చెందాల్సిన నివాస స్థలాలు ధనవంతులు, ఆక్రమణదారుల చేతుల్లో చేరిపోతున్నాయి. రామగుండం కార్పొరేషన్ పరిధి 2వ డివిజన్ ఇందిరమ్మకాలనీలో కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతుంది. స్థలాల ఆక్రమణపై ఐదేళ్ల క్రితం ఫిర్యాదులు వెళ్లిన క్రమంలో రెవెన్యూ అధికారులు ఇందిరమ్మకాలనీలో ఇంటింటా తూతూ మంత్రంగా సర్వే చేపట్టి మధ్యలోనే వదిలేశారు. దీంతో దళారులు రాజ్యమేలుతున్నారు. ఈ ప్రాంతంలో భూమి కొనాలన్నా, అమ్మాలన్నా కొంతమంది ప్రమేయం తప్పనిసరి. ఇందిరమ్మ కాలనీలోని స్థలాలను విక్రయించరాదని నిబంధనలు ఉన్నా యథేచ్ఛగా విక్రయాలు కొనసాగిస్తూ తమ మార్కును పెంచుకుంటున్నారు.

దళారుల గుప్పిట్లో పేదల భూములు

పేదలు నివసించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం ధనవంతుల చేతుల్లోకి వెళ్లడంతో అర్హులకు అన్యాయం జరుగుతోంది. ఇందిరమ్మకాలనీలో 2008 నుంచి ఇప్పటివరకు అధికారికంగా 6,365 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు సమాచారం. వాటిలో సుమారు 500 మంది మాత్రమే లబ్ధిదారులు నివాసముంటున్నారు. మిగతా నిర్మాణాలు వివిధ దశల్లో నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఇదే కాలనీకి చెందిన కొందరు తమ పలుకుబడితో ఈప్రాంతాన్ని వ్యాపార కేంద్రంగా మలుచుకుని గతంలో బీదవారుగా ఉన్న వారు నేడు ధనవంతులుగా మారిపోయారు. ఖాళీ స్థలాలను గుర్తించి ఒక్కో ప్లాటుకు ఒక్కో ధర నిర్ణయించి విక్రయిస్తున్నారు. అమ్మకాలు, కొనుగోళ్లు అంతా సాదా పత్రాల్లోనే మారుతూ ఉంటుంది. సొంతంగా పట్టా ఉన్నవారి ప్లాట్లను ఆక్రమించిన ఘటనలు గతం నుంచి నేటి వరకు సర్వసాధారణంగా మారియి. అసలైన ఇందిరమ్మ లబ్ధిదారులు తమకు ప్రభుత్వం ఇచ్చిన, తాము పోగుచేసుకున్న డబ్బులతో అరకొరగా ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నారు. ఇక దళారుల నుంచి ప్లాట్లు కొనుగోలు చేసిన కొందరు ఖరీదైన భవంతులను నిర్మించుకుంటున్నారు.


కాలనీలో కొనసాగుతున్న నిర్మాణాలు

కొనసాగుతున్న చదును పనులు

ఇందిరమ్మకాలనీలో కొందరు ఒక టీంగా ఏర్పడి పేదలకు భూములు ఇస్తాం అంటూ ఖాళీ స్థలాల చదును ప్రారంభించారు. చదును చేపట్టడంతో పాటు స్థలాలు కావాల్సినవారి నుంచి ముందస్తుగా చదును పనుల కోసం వసూళ్లు కొనసాగిస్తున్నారు.

అక్రమంగా చదును చేస్తే చర్యలు

కార్పొరేషన్ రెండో డివిజన్ ఇందిరమ్మకాలనీలో గురువారం ఖాళీ స్థలాలను కొందరు చదును చేస్తున్న విషయమై మాకు సమాచారం వచ్చింది. ప్రభుత్వ భూములను ఎవరు ఆక్రమించినా, అనుమతి లేకుండా ఎట్టి నిర్మాణాలు చేపట్టినా చర్యలు తీసుకుంటాం. – జాహెద్ పాషా, తహసీల్దార్, రామగుండం

100 ఫీట్ల రోడ్డు కబ్జా

ఇందిరమ్మ కాలనీలో 100 ఫీట్ల రోడ్డు నిర్మించేందుకు వీలుగా ప్లాట్లను ఏర్పాటు చేసి గతంలో అందించారు. ప్రస్తుతం వంద ఫీట్ల రోడ్డు నిర్మాణం ఏర్పాటు కాకపోవడంతో 30 ఫీట్లు రోడ్డు వదిలి ఇరువైపులా మిగిలి పోతున్న 35 ఫీట్ల చొప్పున భూమిని కూడా కాజేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈక్రమంలో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం అక్రమార్కులకు వరంగా మారింది. కాలనీలో పూర్తిస్థాయిలో సర్వే చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. కాగా సర్వే తర్వాతనే బినామీగా ఉన్నవారు ఎందరు, అసలు మంజూరు ఉన్నవారు ఎవరనే విషయాలు వెలుగులోకి రానున్నాయి.

లోకోపైలెట్లపై మానసిక ఒత్తిడి సరికాదు


ప్రసంగిస్తున్న రామారావు

రామగుండం: రైల్వే లోకోపైలెట్ల ఉద్యోగ నిర్వహణలో పలు రకాల సడలింపులు కల్పించాలని, వారిని మానసిక ఒత్తిడికి గురి చేయరాదని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ రామగుండం బ్రాంచ్ కార్యదర్శి మెట్ట రామారావు అన్నారు. సోమవారం దేశవ్యాప్త లోకోపైలెట్ల నిరసన పిలుపులో భాగంగా స్థానిక రైల్వేస్టేషన్ ప్రాంగణంలోని కార్యాలయం ఎదుట లోకోపైలెట్లు తమ కుటుంబసభ్యులతో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రన్నింగ్ రూంలో కుటుంబసభ్యులతో కూడా ఫోన్ మాట్లాడకుండా మొబైల్ ఫోన్లు డిపాజిట్ చేయడం సరికాదన్నారు. నిబంధనల మేరకు పని గంటలు చేయించాలన్నారు. కుటుంబ, వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా రెస్ట్, లీవ్ మంజూరు చేయాలని కోరారు. మహిళా లోకోపైలెట్లకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. నిర్దేశిత గడువులోగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ చైర్మన్ ఓవై.స్వామి, ఆనంద్ రాథోడ్, వీరన్న, రమేష్ తదితరులున్నారు.

ఐదేళ్లుగా పంటలు మునుగుతున్నా పట్టించుకోరా..?

- భూమికి బదులు భూమి ఇచ్చి ఆదుకోండి
- మంథనిలో బాధిత రైతుల ధర్నా

మంథని: 'ప్రాజెక్టు కట్టినప్పుడు మా పొలాలకు ఏం కాదు అన్నరు.. మా భూములు తీసుకొని మరో చోట ఇస్తమన్నరు.. లేకుంటే ఎకరానికి రూ.20 లక్షలు చెల్లిస్తమంటిరి.. ఐదేళ్ల సంది నీళ్లల్ల భూమి ఉంటే పట్టించుకుంటలేరు.. ఇదెక్కడి న్యాయం.. ఎవరికి చెప్పినా మా గోడు వినకపోతిరి.. గండుకే రోడ్డుమీదకు అచ్చినం' అంటూ కాళేశ్వరం ప్రాజెక్టు బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నిర్మించిన అన్నారం బ్యారేజీ బ్యాక్‌వాటర్ మూలంగా ముంపునకు గురవుతున్న మంథని మండలం ఆరెంద, మల్లారం, ఖాన్‌సాయిపేట, అమ్మగారిపల్లి, ఖానాపూర్ గ్రామ రైతులు సోమవారం మంథనికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. సుమారు 2గంటల పాటు ప్రధాన చౌరస్తాలో ధర్నా చేపట్టారు. తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. బ్యాక్ వాటర్ మూలంగా ఇప్పటికి పలుమార్లు పంట మునిగితే కేవలం మూడుసార్లు మాత్రమే క్రాప్ హాలీడే కింద పరిహారం ఇచ్చి వదిలేశారని వాపోయారు. తమకు ఏ ఆధారం లేదని, కోల్పోయే భూమికి బదులు మంథని లేదా ఇతర ప్రాంతాల్లో భూమి కేటాయించాలని డిమాండ్ చేశారు. వీలుకాని పక్షంలో ఎకరాకు రూ. 30లక్షలు పరిహారం చెల్లించాలన్నారు. ధర్నాతో పెద్ద ఎత్తున ఇరువైపులా వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ధర్నా విరమించాలని కోరగా, ఆర్డీఓ తమ సమస్యకు పరిష్కారం చూపేవరకు ఆందోళన విరమించమని భీష్మించుకూర్చున్నారు. తహసీల్దార్ ప్రకాష్ రైతులతో మాట్లాడి వారి డిమాండ్లతో కూడిన వినతిపత్రం స్వీకరించారు. అనంతరం ఆందోళన విరమించిన రైతులు ఆర్డీఓ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లారు. కార్యాలయంలోకి రైతులు వెళ్లకుండా మెయిన్ గేట్ మూసివేసి పోలీసులు కాపలా ఉన్నారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, రైతులు ఆర్డీఓ వీరబ్రహ్మచారికి సమస్యను వివరించారు. ఈక్రమంలో ఆర్డీవోకు బాధిత రైతులు గోడు వెలబోసుకుని వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఆయన కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లుకు ఫోన్‌లో సమస్యను వివరించారు. కాగా రైతులకు మద్దతుగా అఖిల పక్షం నాయకులు ధర్నాలో పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న రైతులు

కేశోరాం ఎన్నికల్లో 'బయ్యపు' విజయం

- ఉత్కంఠ పోరులో 12 ఓట్లతో గెలుపు
- వరుసగా రెండోసారి జయకేతనం
- బీఆర్‌ఎస్ బలపరిచిన అభ్యర్థి పరాజయం

పాలకుర్తి(రామగుండం): బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంలో సోమవారం జరిగిన పర్మినెంట్ కార్మికసంఘం ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నాయకుడు, కన్నాల సింగిల్‌విండో చైర్మన్ బయ్యపు మనోహర్‌రెడ్డి ప్యానల్ ఘన విజయం సాధించింది. అధ్యక్ష అభ్యర్థి మనోహర్‌రెడ్డి కాంగ్రెస్ నాయకుడు, జీడీనగర్ సర్పంచ్ సూర సమ్మయ్యపై 12ఓట్ల తేడాతో గెలుపొందారు. ప్రధాన కార్యదర్శిగా దాడి మహేశ్‌యాదవ్, రమేశ్‌ప్రసాద్ మౌర్యపై 40 ఓట్ల తేడాతో గెలుపొందారు. మొత్తం 263 ఓట్లకు వంద శాతం పోలయ్యాయి. ఇందులో మనోహర్‌రెడ్డికి 97, సమ్మయ్యకు 85ఓట్లు వచ్చాయి. బీఆర్‌ఎస్ పార్టీ అధికారికంగా బలపరిచిన మరో అభ్యర్థి, ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఇంజపూరి నవీన్‌కు 78 ఓట్లు వచ్చాయి. దాడి మహేశ్‌కు 117, రమేశ్‌ప్రసాద్ మౌర్యకు 74ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి వడ్ల సత్తయ్యకు 64 ఓట్లు వచ్చాయి.

సమష్టి విజయం

తమ విజయం కార్మికులందరి విజయమని బయ్యపు మనోహర్‌రెడ్డి అన్నారు. గెలుపు అనంతరం బసంత్‌నగర్‌లో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ముందుగా శ్రీకోదండ రామాలయంలో పూజలు చేశారు. వర్కర్స్ కాలనీ, జె.టైపు క్వార్టర్లలో ర్యాలీ తీశారు. మంత్రి కొప్పుల ఈశ్వర్, జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, రామగుండం, పెద్దపల్లి ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, దాసరి మనోహర్‌రెడ్డి సహకారంతో కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. నాయకులు పర్శవేణి శ్రీనివాస్, ఇనగంటి భాస్కర్‌రావు, పూదరి సత్యనారాయణ, పిన్‌రెడ్డి కిషన్‌రెడ్డి, పుప్పాల దయానందం, కుడిక్యాల సురేష్, పోతుల ప్రసాద్, వంశీ, ఇటిక్యాల శ్రీకాంత్, ఒడ్నాల కుమారస్వామి, గణపతి శ్రీనివాస్, బొడ్డుపల్లి లక్ష్మణ్, పుట్ట రంజిత్ తదితరులు పాల్గొన్నారు.


విజయం సాధించిన బయ్యపు మనోహర్‌రెడ్డి, దాడి మహేశ్‌యాదవ్

పోలీసుల బందోబస్తు

ఎన్నికల సందర్భంగా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పెద్దపల్లి ఏసీపీ ఎడ్ల మహేశ్ ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు. సీఐ ప్రదీప్‌కుమార్, ట్రాఫిక్ సీఐ అనిల్‌కుమార్, పొత్కపల్లి, ధర్మారం, పెద్దపల్లి ఎస్సైలు మహేందర్‌యాదవ్, శ్రీనివాస్, సహదేవ్‌సింగ్, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

హిందూ ధర్మ పరిరక్షణలో పురోహితుల పాత్ర కీలకం

- విశ్వహిందూ పరిషత్ జాతీయ సహ కార్యదర్శి సత్యంజీ

గోదావరిఖని(రామగుండం): హిందూ ధర్మ పరిరక్షణలో అర్చక పురోహితుల పాత్ర కీలకమని విశ్వహిందూ పరిషత్ జాతీయ సహ కార్యదర్శి సత్యంజీ పేర్కొన్నారు. సోమవారం స్థానిక శారదనగర్‌లోని విశ్వహిందూ పరిషత్ భవనంలో అర్చక పురోహితుల సమావేశం నిర్వహించారు. హిందూ సమాజం జాగృతం కావాలంటే ఆలయ కేంద్రంగా భక్తి నిర్మాణంతో ఈ దేశాన్ని కాపాడుకోగలమన్నారు. ఇందులో భాగంగా అర్చక పురోహితులు, పీఠాధిపతులు హిందూ సమాజానికి మార్గదర్శనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. గురు పరంపర హిందూ ధర్మాన్ని ఆచరణ చేయమని చెప్పడం గురువుల ద్వారా మాత్రమే సాధ్యమవుతుందన్నారు. మతమార్పిడులను ఆపాల్సిన బాధ్యత అర్చక పురోహితుల మీద ఉందన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు మాధవరపు వెంకటరావు, జిల్లా కార్యదర్శి అయోధ్య రవీందర్, అర్చక పురోహిత సంఘం అధ్యక్షుడు ఓజ్జల వెంకన్నశర్మ, జగన్నాథచార్యులు, మురళీధర శర్మ, మధుసూదనాచార్యులు తదితరులు పాల్గొన్నారు.


పురోహితులను సన్మానిస్తున్న నాయకులు

పోరాటాలతోనే హక్కులు సాధ్యం


నరేశ్


శంకర్


అశోక్

జ్యోతినగర్(రామగుండం): కార్మికోద్యమాలు, పోరాటాలతోనే హక్కులు సాధించుకోవచ్చని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి నరేశ్ అన్నారు. ఎన్టీపీసీ రామగుండం టీవీ గార్డెన్స్‌లో రెండు రోజులుగా జరుగుతున్న ఐఎఫ్‌టీయూ జిల్లా 8వ మహాసభల ముగింపు కార్యక్రమం ఆదివారం రాత్రి జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. మహాసభల్లో గత ఉద్యమాల పోరాటాలను సమీక్షించుకుని భవిష్యత్ పోరాట కార్యక్రమాలను రూపొందించుకోవడం జరిగిందని తెలిపారు. 11 తీర్మానాలను ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు.

నూతన కార్యవర్గం

మహాసభల అనంతరం ఐఎఫ్‌టీయూ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఈదునూరి నరేశ్ (గోదావరిఖని), ఉపాధ్యక్షుడు చిలుక శంకర్ (ఎన్టీపీసీ–రామగుండం), ప్రధాన కార్యదర్శి బి.అశోక్ (యైటింక్లయిన్ కాలనీ), సహాయ కార్యదర్శి కోంండ్ర మొగిలి, కోశాధికారి డి.బుచ్చమ్మ, కార్యవర్గ సభ్యులు ఎం.దుర్గయ్య, బుచ్చయ్య, లింగమూర్తి, మనోజ్, రాజేశం, ఎల్లయ్య, కొమురయ్య తదితరులను ఎన్నుకున్నారు.

'సహకార' పెట్రోల్ బంక్ ఏర్పాటు

సుల్తానాబాద్: సుల్తానాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో పట్టణ శివారు నీరుకుల్లలో పెట్రోల్ బంక్ ఏర్పాటుకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపినట్లు సింగల్ విండో చైర్మన్, కేడీసీసీబీ ఉమ్మడి జిల్లా డైరెక్టర్ శ్రీగిరి శ్రీనివాస్ తెలిపారు. స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో 126వ సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. రైతులకు దీర్ఘ, స్వల్పకాలిక రుణాలు అందిస్తున్నామని తెలిపారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, ఫర్టిలైజర్, సీడ్స్, నిత్యావసరాలు అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. మినరల్ వాటర్ ప్లాంట్ అందుబాటులో ఉన్న నేపథ్యంలో వాటర్ బాటిళ్ల తయారీ యంత్రానికి, రైతులకు 6 శాతం డివిడెంట్ ఇచ్చేందుకు, 2023–24 సంవత్సరం అంచనా బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు. సూపర్ మార్కెట్‌లో రూ.పది వేల విలువ చేసే వస్తువులు కొంటే రూ.500 గిఫ్ట్ ఇవ్వడానికి ఆమోదం తెలిపారు. జీవో నంబర్ 44 ప్రకారం.. సంఘం ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని తీర్మానించారు. సమావేశంలో పీఏసీఎస్ కార్యదర్శి బూర్గు సంతోష్ కుమార్ డైరెక్టర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీగిరి శ్రీనివాస్

'విండో' సేవలను విస్తృతం చేద్దాం

పెద్దపల్లిరూరల్: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ద్వారా రైతులు, గ్రామస్తులకు మెరుగైన సేవలందిస్తున్నామని అప్పన్నపేట సహకార సంఘం చైర్మన్ దాసరి చంద్రారెడ్డి అన్నారు. విండో సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. సొసైటీలో 2,315 మంది సభ్యులు ఉన్నారని, 659మంది సభ్యులకు రూ.4.72 కోట్ల స్వల్పకాలిక, 188 మందికి రూ.3.10కోట్ల దీర్ఘకాలిక రుణాలు అందించామని వివరించారు. 27మంది రూ.28లక్షల డిపాజిట్ చేశారన్నారు. ధాన్యం కొని మిల్లర్లకు పంపిస్తే మిల్లర్లు కోతలు పెడుతున్నారని సభ్యులు తెలపగా.. మిలర్లతో చర్చించి చర్యలు తీసుకుంటామని చైర్మన్ చంద్రారెడ్డి, వైస్‌చైర్మన్ చింతపండు సంపత్ తెలిపారు. రైతుల సౌలభ్యం కోసం మరో రెండు కేంద్రాలను పెంచుతామన్నారు. సీఈఓ గడ్డి తిరుపతి, విండో డైరెక్టర్లు, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి


చిన్నారులతో ఏసీపీ గిరిప్రసాద్, సీఐ వేణుగోపాల్

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): చిన్ననాటి నుంచి విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని గోదావరిఖని ఏసీపీ గిరిప్రసాద్ అన్నారు. సోమవారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ సీఈఆర్ క్లబ్‌లో స్థానిక స్పందన మోడల్ స్కూల్ యాజమాన్యం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ వేడుకలకు ముఖ్య అతిథులుగా ఏసీపీ, టూటౌన్ సీఐ వేణుగోపాల్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ, చిన్నారులు ఎక్కువగా వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను అనుసరిస్తారని పేర్కొన్నారు. పిల్లల మార్కులపై కాకుండా వారిని ఎక్కువగా సబ్జెక్టుపై ఎడ్యుకేట్ చేయాలన్నారు. వారికి సెల్ ఫోన్ ఇవ్వకుండా చూసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్స్ అందజేశారు. ఈసందర్భంగా చిన్నారుల నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో సెస్టోబాల్ సౌత్ జోన్ చైర్మన్ జక్కుల దామోదర్‌రావు, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కేశవరెడ్డి, ఉపాధ్యక్షుడు టంగుటూరి రాజయ్య, పాఠశాల కరస్పాండెంట్ ఓదెలు యాదవ్, హెచ్‌ఎం రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సివిల్ విభాగం తనిఖీ



గోదావరిఖని(రామగుండం): సివిల్ భద్రత వారోత్సవాల సందర్భంగా సోమవారం ఆర్జీ–2 సివిల్ విభాగాన్ని అధికారులు తనిఖీ చేశారు. భూపాలపల్లి నుంచి వచ్చిన తనిఖీ బృందం భద్రతకు తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. రక్షణ అధికారి జీఎల్ ప్రసాద్, షణ్ముగం, బాలరాజు, ఏరియా రక్షణ అధికారి బి.రవీందర్, సివిల్ డీజీఎం ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

కమాన్‌పూర్(మంథని): మండలంలోని జూలపల్లి గ్రామానికి చెందిన బొల్లపల్లి సమ్మయ్య(40) అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యుల వివరాలు.. సమ్మయ్య రామగుండం కార్పొరేషన్ పరిధిలోని వీర్లపల్లిలో తెల్ల కల్లు అమ్మేవాడు. గతంలో వైన్‌షాపు నడిపించగా అందులో నష్టం రావడంతో జూలపల్లి గ్రామం నుంచి వీర్లపల్లికి వెళ్లి అక్కడ కల్లు అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వారం క్రితం జూలపల్లిలో జరిగిన రేణుక ఎల్లమ్మ ఉత్సవాలకు కుటుంబ సభ్యులతో వచ్చాడు. అప్పులు తీర్చలేనని మనస్తాపం చెందిన సమ్మయ్య శనివారం సాయంత్రం ఇంట్లో పురుగుల మందు తాగి పడిపోవడంతో కుటుంబ సభ్యులు పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతిచెందాడు. మృతుడికి భార్య రాజమణి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షేక్‌మస్తాన్ తెలిపారు.

ఉన్నత స్థాయికి చేరుకోవాలి

గోదావరిఖని(రామగుండం): క్రమశిక్షణతో ముందుకు సాగి జీవితంలో ఉన్నత స్థాయికి చేరాలని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ ఆకాంక్షించారు. సోమవారం జీఎం కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 9మంది యువ ఉద్యోగులకు కారుణ్య నియామకాలు అందజేశారు. ఈసందర్భంగా జీఎం మాట్లాడుతూ, ప్రస్తుత సమయంలో చిన్న సంస్థలో ఉద్యోగాలు దొరకడం కష్టంగా మారిందని, ఈక్రమంలో సింగరేణి సంస్థలో ఉద్యోగం దొరకడం అదృష్టంగా భావించాలన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకుని జీవితంలో రాణించాలని కోరారు. గైర్హాజర్ లేకుండా వృత్తి నైపుణ్యం సాధించాలన్నారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, ఐఈడీ డీజీఎం మురళీక్రిష్ణ, వంశీధర్ తదితరులు పాల్గొన్నారు.


నియామక పత్రాలు అందజేస్తున్న జీఎం మనోహర్